ప్రజా విశ్వంభర V3 NEWS



# నర్గీస్ ఫక్రీ టాలీవుడ్‌కి స్పెషల్ ఎంట్రీ

టాలీవుడ్‌కి స్పెషల్ ఎంట్రీ ఇచ్చారు బాలీవుడ్ నటి నర్గీస్ ఫక్రీ. హవీష్ హీరోగా నటించిన 'నేను రెడీ' సినిమాలో నర్గీస్ ఫక్రీ స్పెషల్ సాంగ్ చేశారు. తెలుగులో ఆమె నటించిన తొలి చిత్రం ఇదే. కావ్య థాపర్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో బ్రహ్మానందం, శ్రీలక్ష్మి, 'వెన్నెల' కిశోర్, మురళీ శర్మ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారు. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో కోనేరు సత్యనారాయణ, నిఖిల కోనేరు నిర్మించారు. "నేను రెడీ' సినిమా రీ–రికార్డింగ్ పనులతో సహా ఇటీవలే షూటింగ్ పూర్తయింది. జూన్ రెండో వారంలో ఈ సినిమాను విడుదల చేయడానికి సిద్ధం చేస్తున్నాం. హవీష్‌కు క్లీన్ కమర్షియల్ విజయాన్ని అందిస్తుందన్న నమ్మకం ఉంది" అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్.

**బొద్దుగా కనిపించే హీరోయిన్లు, హఠాత్తుగా బక్కచిక్కిపోయి కనిపిస్తే ఎవరికైనా లేనిపోని సందేహాలు వస్తాయి. హీరోయిన్ కీర్తి సురేశ్ గురించి గతంలో ఇలానే అనుకున్నారు. 2018లో 'మహానటి'లో నిండుగా బొద్దుగా కనిపించిన ఈమె.. తర్వాత కాలంలో ముఖంలో జీవకళ కోల్పోయినట్లు సన్నగా మారిపోయి షాకిచ్చింది. దీంతో అసలు ఈమెకు ఏమైందా అనుకున్నారు. కొందరైతే సర్జరీ చేసుకుందేమోనని కామెంట్స్ చేశారు. ఇప్పుడు ఆ సందేహాలపై స్వయంగా కీర్తినే క్లారిటీ ఇచ్చేసింది. సోషల్ మీడియాలో పెద్ద పోస్ట్ పెట్టింది.**

'2013లో నటిగా కెరీర్ ప్రారంభించినప్పుడు ఫిట్‌నెస్‌పై నాకేం అవగాహన లేదు. జిమ్ నా వల్ల కాదు అనుకునేదాన్ని. 2018లో 'మహానటి' చేసిన తర్వాత కాస్త గ్యాప్ దొరకడంతో ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలనుకున్నా. హెచ్‌ఐఐటీ, కార్డియో వర్కౌట్స్‌తో పాటు ఎక్కువ ప్రొటీన్, తక్కువ కార్బో డైట్ పాటించి 9 నెలల్లో 10 కిలోల బరువు తగ్గాను. కానీ నేను ఇంత కష్టపడితే కొందరు మాత్రం బలహీనంగా కనిపిస్తున్నావు, సర్జరీలు చేయించుకున్నావా అని అన్నారు. అది నాకు ఆవేదన కలిగించింది''2020లో యోగా చేయడం మొదలుపెట్టిన తర్వాత నా జీవితంలో పెద్ద మార్పు వచ్చింది. మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం, శరీరంపై ప్రేమ పెరిగింది. సరైన విధంగా జిమ్ చేస్తే ఎంత ఉపయోగమో, స్ట్రెంగ్త్ ట్రైనింగ్ ఎంత ముఖ్యమో అర్థమైంది. ప్రస్తుతం స్ట్రెంగ్త్ ట్రైనింగ్‌తోపాటు యోగా, అనిమల్ ఫ్లో, కార్డియో, కాలిస్థెనిక్స్‌ను బ్యాలెన్స్‌గా చేస్తున్నాను. ఇప్పుడే నా జీవితంలో బెస్ట్ ఫేజ్ లో ఉన్నా''అయితే నా చిన్నప్పుడు కాస్త లావుగా ఉన్నానని సన్నబడమని చెప్పినవాళ్లే.. ఇప్పుడు సన్నబడిన తర్వాత గతంలోనే బాగున్నావని అంటున్నారు. అసలు ప్రపంచం ఎలా ఆలోచిస్తుందో అర్థం కావట్లేదు. ఈ మధ్య శారీరకంగా, మానసికంగా కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నవడం వల్లే బయట కనిపించలేదు.







# ఇండస్ట్రీకి వచ్చి ఇన్నేళ్లైనా నా కోరిక తీరలేదు: అవికా గోర్

**'చిన్నారి పెళ్లికూతురు' సీరియల్ ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుని, ఆ తర్వాత 'ఉయ్యాల జంపాల' సినిమాతో టాలీవుడ్‌లోకి హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది అవికా గోర్. తెలుగులో పలు చిత్రాల్లో నటించి మెప్పించిన ఈ ముద్దుగుమ్మ, త్వరలోనే విడుదల కాబోతున్న 'అగ్లీ స్టోరీ' అనే సినిమాతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా అవికా గోర్ తన కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితంపై చేసిన కొన్ని ఆసక్తికరమైన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా చర్చనీయాంశంగా మారాయి. సినిమాల్లో తన ప్రయాణం గురించి అవికా మాట్లాడుతూ.. "నేను ఇప్పటివరకు ఎన్నో సినిమాలు, విభిన్నమైన పాత్రలు చేశాను. కానీ ఒక నటిగా నాకు పూర్తిగా ఆత్మసంతృప్తిని కలిగించే ఒక డ్రీమ్ రోల్‌ను మాత్రం ఇప్పటివరకు చేయలేకపోవడంతో నా కోరిక తిరలేదు.**

ఇండస్ట్రీకి వచ్చి ఇన్నేళ్లైనా నా మనసుకు నచ్చిన, ఛాలెంజింగ్‌గా ఉండే ఆ ఒక్క పాత్ర కోసం నేను ఇంకా ఎదురుచూస్తూనే ఉన్నాను. నా లైఫ్‌లో అదొక చిన్న బాధగా మిగిలిపోయింది" అంటూ తన ఆవేదనను పంచుకుంది. ఇక తన వ్యక్తిగత జీవితం, పెళ్లి గురించి అవికా ఆసక్తికరమైన విషయాలను బయటపెట్టింది. "నేను మిలింద్ దాదాపు ఏడేళ్ల పాటు ప్రేమించుకున్నాం. ఆ తర్వాత మా ఇరు కుటుంబ సభ్యులను ఒప్పించి పెళ్లి చేసుకున్నాం. అయితే మొదట్లో మా పేరెంట్స్ ఈ పెళ్లి విషయంలో కొంచెం సందేహపడ్డారు. కానీ ఆ తర్వాత మా ప్రేమను, మమ్మల్ని అర్థం చేసుకుని సంతోషంగా మా పెళ్లికి ఒప్పుకున్నారు" అని అవికా చెప్పింది. పెళ్లి తర్వాత తన లైఫ్ ఎలా ఉందనే విషయంపై స్పందిస్తూ.. వివాహ బంధంలోకి అడుగుపెట్టాక తన జీవితం చాలా సంతోషంగా సాగుతోందని, ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బందులు లేదా సమస్యలు ఎదురుకాలేదని స్పష్టం చేసింది. తామిద్దరం ఒకరినొకరు చాలా బాగా అర్థం చేసుకుంటూ జీవితంలో ముందుకు సాగుతున్నామని పేర్కొంది. అలాగే పెళ్లి తర్వాత తన జీవితంలో కొన్ని మార్పులు వచ్చిన మాట వాస్తవమేనని, అయితే ఆ మార్పులన్నీ చాలా పాజిటివ్‌గా ఉన్నాయని అవికా గోర్ ఆనందం వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.



# ఎవ్వరూ ఊహించని రన్‌టైమ్‌తో నాగబంధం!

పెద్దకాపు సినిమా ద్వారా హీరోగా వెండితెరకు పరిచయమైన విరాట్ కర్ణ ప్రస్తుతం నాగబంధం అనే చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తున్నాడు. ఈ సినిమాలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్ హీరోయిన్లుగా కనిపించనుండగా అభిషేక్ నామ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని జూలై 3న విడుదల చేయనున్నారు. ఇప్పటివరకు ఈ సినిమా నుంచి విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకోవడంతో మూవీపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. తాజాగా ఈ సినిమా రన్‌టైమ్‌కు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం నాగబంధం సినిమా ఏకంగా 3 గంటల 17 నిమిషాల భారీ రన్‌టైమ్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ఇంత పెద్ద రన్‌టైమ్‌తో సినిమాలను విడుదల చేయడంలో మేకర్స్ కొంత వెనకడుగు వేస్తుంటారు. సినిమా ఏ మాత్రం బోర్ కొట్టినా నెగటివ్ టాక్ వచ్చే అవకాశం ఉంటుందనే భావన ఇందుకు ప్రధాన కారణం. అలాంటి పరిస్థితుల్లో కూడా ఈ చిత్రాన్ని భారీ రన్‌టైమ్‌తో సిద్ధం చేయడం చూసి ఇందులో కచ్చితంగా మంచి గ్రిప్పింగ్ స్టోరీ, బలమైన స్క్రీన్‌ప్లే ఉంటుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరి నాగబంధం ప్రేక్షకులను ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో చూడాలి. కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి అభే సంగీతం అందిస్తున్నారు..



# రజనీతో పోటీ ఉంటుంది కానీ, అసూయ ఎందుకుంటుంది: కమల్‌హాసన్

**చెన్నై:** రజనీకాంత్, తాను వెండితెరపై ఒకరితో ఒకరు పోటీపడతామే తప్ప, తమ మధ్య అసూయ అనేది లేదని ప్రముఖ నటుడు, ఎంపీ కమల్ హాసన్ స్పష్టం చేశారు. విజయ్ సీఎం అయితే, తానెందుకు అసూయపడతానని, ఒకవేళ కమల్‌హాసన్ సీఎం అయి ఉంటే అసూయ పడేవాడినని రజనీకాంత్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ విషయమై విలేకరులు కమల్‌హాసన్‌ను ప్రశ్నించగా, ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తామిద్దరం ఇరవై ఏళ్ల వయసులోనే ఒకరిపై ఒకరు ఎలాంటి విమర్శలు చేసుకోకూడదని నిర్ణయించుకున్నామని తెలిపారు. వేర్వేరు పంథాల్లో సాగుతూ ఆరోగ్యకరమైన పోటీతోనే రాణిస్తున్నామని అన్నారు. ''కమల్ సీఎం అయితే, అసూయపడతా'నని రజనీకాంత్ నవ్వుతూ చెప్పారు. మేం ఒకరితో ఒకరం పోటీ పడతాం కానీ అసూయ ఎందుకు పడతాం. మేము సినీ రంగంలో ఉన్నాం. క్రికెట్లో ఉన్నా ఇలాగే ఉండేవాళ్లం'' అని కమల్‌హాసన్ అన్నారు. సీఎం విజయ్‌ను కలిసిన సందర్భంగా ఇచ్చిన వినతి పత్రంలో కీలక అంశాలు ఏంటి? అని అడగ్గా, 'మీరు చదివి కూడా చూడలేదన్నట్లు అడుగుతున్నారు. వాటిని మీ మిత్రులే రాశారు. మళ్లీ మళ్లీ దాని గురించి మాట్లాడుకోవద్దు. వినతిపత్రంలోని అంశాల్లో కీలకం ఏదో దానిని అండర్‌లైన్ చేసి చూపించడం మీ బాధ్యత' అని సమాధానమిచ్చారు. 'సీఎం అయ్యాక విజయ్‌ను అన్ని రాజకీయ పార్టీల నాయకులను వెళ్లి కలిశారు. అన్నాడీఎంకే ప్రధానకార్యదర్శి ఎడప్పాడి పళనిసామిని కలవకపోవడం చర్చనీయాంశంగా మారింది. అన్నాడీఎంకే చీలికవర్గంలోని 25 మంది ఎమ్మెల్యేలు విజయ్ వెంట వెళ్లేలా ఉన్నారని అంటున్నారు. ఈ పరిస్థితులను మీరు ఎలా చూస్తున్నారు' అని మరో విలేకరి అడగ్గా, 'మీలాగే చూస్తున్నాను. చోద్యం చూస్తున్నా' అంటూ కమల్ కాస్త ఘాటుగానే స్పందించారు.

# కోహ్లీ ఆ స్థాయికి ఎప్పుడో చేరిపోయాడు: అశ్విన్

**విశ్వంభర, స్పోర్ట్స్ :** ప్రతి మ్యాచ్ సమయంలోనూ ప్రత్యేకంగా నిరూపించుకోవాల్సిన పరిస్థితులు తనకు అవసరం లేదని ఇటీవల స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ సంచలన వ్యాఖ్యలు చేశాడు. టెస్టులకు వీడ్కోలు పలకడం వెనుక ప్రధాన కారణం ఇదేనని పరోక్షంగా బీసీసీఐ సెలక్షన్ కమిటీని ఉద్దేశించి విరాట్ ఆ వ్యాఖ్యలు చేశాడు. కోహ్లీ కామెంట్లపై మాజీ క్రికెటర్ రవి చంద్రన్ అశ్విన్ స్పందించాడు. జట్టుకోసం ఎన్నో సాధించిన సీనియర్ క్రికెటర్లపై నిత్యం స్క్రూటినీ చేయడం సరైంది కాదని వ్యాఖ్యానించాడు. అలాంటి పరిస్థితులను తట్టుకోవాలంటే మానసికంగా చాలా దృఢంగా ఉండాలన్నారు. ''ఎవరికీ తన పనితనం గురించి నిరూపించుకోవాల్సిన అవసరం లేదని విరాట్ అన్నాడు. ఈ విషయంలో కోహ్లీ సరిగ్గానే చెప్పాడు. నేను కూడా అలానే భావిస్తున్నా. ప్రత్యేకంగా నిరూపించుకోవడానికి ఇంకేం మిగిలి ఉంది. కొన్నేళ్లపాటు భారత జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిన ప్లేయర్ ఎవరి కోసం నిరూపించుకోవాలి? బయటి వ్యక్తులు ఏవేవో మాట్లడుతుంటారు. అది వారి పని. కుర్రాడిగా ఉన్నప్పుడైతే 'నువ్వు అనుకున్నది తప్పని నిరూపిస్తా'



అని గట్టిగా చెప్పొచ్చు. పరిణతి, తెలివి పెరిగినప్పుడు యుద్ధం ఎవరితోనో కాదు.. మనతో మనమే పోటీపడాలని తెలుసుకుంటాం. అప్పుడు జీవితం చాలా సాఫీగా సాగిపోతుంది. విరాట్ కోహ్లీ ఎప్పుడో ఈ స్థాయిని చేరుకున్నాడు'' అని అశ్విన్ అభిప్రాయపడ్డాడు.

**పడిక్కల్‌కు ఛాన్స్ ఇవ్వాలి**

''భారత టెస్టు జట్టులో దేవదత్ పడిక్కల్‌ను మూడో స్థానంలో చూడాలనుకుంటున్నా. చాలా బాగా ఆడుతున్నాడు. టెస్టు జట్టులో స్థానానికి అతడు అర్హుడే. ఒకటీ రెండు మ్యాచుల్లో ఇబ్బంది పడినా.. మరిన్ని అవకాశాలు ఇవ్వాలి. ఈ ఐపీఎల్‌లో అతడు సిక్సులు కొట్టడం చూడండి. మంచి టైమింగ్‌తో స్టాండ్స్‌లోకి పంపిస్తున్నాడు. దినేశ్ కార్తిక్‌కు నకలు మాదిరిగా కనిపించాడు. స్పిన్నర్లపై మరింత దూకుడుగా ఉన్నాడు. రాజస్థాన్ రాయల్స్‌కు మేమిద్దరం కలిసి ఆడాం. అతడు బ్యాక్ ఫుట్‌పై స్పిన్‌ను ఎదుర్కొనే తీరు చాలా బాగుంటుంది. ఇప్పుడు స్వీప్, రివర్స్ స్వీప్‌తోనూ పరుగులు రాబట్టేస్తున్నాడు. టెస్టు జట్టులో పడిక్కల్‌ను అధిగమించి సాయి సుదర్శన్ స్థానం సంపాదించాడు. సుదర్శన్ మంచి బ్యాటర్. ఓపెనర్‌గా వస్తూ ఇప్పుడు ఐపీఎల్ ఆరెంజ్ హోల్డర్‌గా మారాడు. దేశవాళీతోపాటు ఐపీఎల్‌లో ప్రదర్శన చేస్తే జాతీయ జట్టుకు ఎంపిక సులువు. ఇది తప్పా? సరైందా? అనేది పక్కన పెడితే మంచి ఆటగాళ్లే ముందుకొస్తున్నారు. తప్పకుండా పడిక్కల్ కూడా జాతీయ జట్టులో స్థానాన్ని సుస్థిరం చేసుకుంటాడని భావిస్తున్నా'' అని అశ్విన్ వ్యాఖ్యానించాడు.

# మే 18నే క్రికెట్ దిగ్గజానికి వీడ్కోలు మ్యాచ్?

**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ కేవలం రెండే మ్యాచులు ఆడాల్సి ఉంది. అదీనూ సొంత మైదానం చెపాక్‌లో ఒకే ఒక్క పోరు మాత్రమే మిగిలి ఉంది. మే 18న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ ఇటు ఎస్ఆర్‌హెచ్‌కు ఎంత ముఖ్యమో.. సీఎస్‌కేకూ అంతే కీలకం. మరోవైపు క్రికెట్ దిగ్గజం ఎంఎస్ ధోని ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. చెపాక్‌లోనైనా ధోనిని చూస్తామా? లేదా? అని అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో ఓ వార్త నెట్టింట వైరల్‌గా మారింది. ధోని ఆ మ్యాచ్‌లో ఆడి.. రిటైర్‌మెంట్ ప్రకటిస్తాడని కథనాలు వస్తున్నాయి. వాటిపై క్రికెట్ వ్యాఖ్యాత హర్షా భోగ్లే ఆసక్తికర కామెంట్స్ చేశారు. ''సీఎస్‌కే ఎస్ఆర్‌హెచ్ మ్యాచ్‌లో సర్‌ప్రైజ్‌ను చూసే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో చెపాక్ వేదికగా ఒకే ఒక్క మ్యాచ్ మాత్రమే మిగిలి ఉంది. అభిమానులను ఆశ్చర్యానికి గురి చేసే నిర్ణయం వచ్చినా నాకేమీ సర్‌ప్రైజ్ కాదు'' అని భోగ్లే విశ్లేషించాడు.



# థాయ్‌లాండ్ ఓపెన్ ఫైనల్‌లో ఓటమి.. రన్నరప్‌గా భారత జోడీ

**విశ్వంభర, స్పోర్ట్స్ :** అద్భుత ప్రదర్శనతో థాయ్‌లాండ్ ఓపెన్ ఫైనల్‌కు చేరిన భారత ద్వయం సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టికి షాక్ తగిలింది. ఫైనల్‌లో ఇండోనేషియా ఆటగాళ్లు లియో రోలీ కర్నాండో డానియల్ మార్టిన్ జోడీ వరుస సెట్లలో విజయం సాధించింది. 1221, 2325 తేడాతో సాత్విక్ చిరాగ్ ద్వయం ఓటమిపాలైంది. మూడో టైటిల్‌ను నెగ్గుదామని భావించిన భారత్‌కు నిరాశే ఎదురైంది.మొదటి సెట్‌లో ఇండోనేషియా ఆటగాళ్ల దూకుడు ముందు భారత్ జోడీ నిలవలేకపోయింది. పెద్దగా పోటీ లేకుండానే 2112 తేడాతో తొలి సెట్‌ను ఇండోనేషియా కైవసం చేసుకుంది. ఇక రెండో సెట్ మాత్రం హోరాహోరీగా సాగింది. భారత ద్వయం చివరి వరకూ పోరాడారు. ఈ సెట్‌ను గెలిచి రేసులోకి వద్దామని భావించినప్పటికీ.. లియో రోలీ కర్నాండో డానియల్ మార్టిన్ పట్టువిడవలేదు. చివరికి 2325 తేడాతో సెట్‌ను, టైటిల్‌ను భారత జోడీ కోల్పోయింది.






Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com